## నిర్లక్ష్యపు నీడలో మాతశిశు ఆసుపత్రి



మెయిన్‌లో...


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 07 ఏప్రిల్, 2024 | పేజీలు : 05


# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు


## కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి లతో కలిసి పాఠశాలలను మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 685 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వేసవి సెలవులు ముగిసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలలో తరగతి గదులు, విద్యుద్దీ 3 కరణ పనులు, మూత్రశాలల మరమ్మత్తులు, మూత్రశాలలకు నీటి సరఫరా సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావడం, త్రాగునీటి సౌకర్యం, తరగతి గదులలో మరమ్మత్తులు, పైకప్పు, గోడలు, తలుపులు, కిటికీలు ఇతరత్రా మరమ్మత్తు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. బాలికల కొరకు ప్రత్యేకంగా మూత్రశాలల నిర్మాణం పనులు చేపట్టాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, గ్రామ సమాఖ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పనులు చేపట్టి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో మండల స్థాయి అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, మండలంలోని గ్రామ సమాఖ్య సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాఠశాలలలో మరమ్మత్తు పనులపై అంచనా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారని, కమిటీల సభ్యులు సహకరించాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం పెంచే విధంగా కమిటీ సభ్యులు కృషి చేయాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద కొనసాగుతున్న పనులలో ఉపాధి కూలీల హాజరు శాతం పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీడ కోసం షామియానా, త్రాగునీరు, ఒఆర్ఎస్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, విద్యాశాఖ అధికారులు, జిల్లా, మండల సమాఖ్య సభ్యులు, సెర్ఫ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల వసూళ్లలో రాజీ లేదు.. వసతుల కల్పనలో శ్రద్ధ లేదు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** భావి భవిష్యత్ తరాలైన విద్యార్థులను తీర్చిదిద్దే విద్యాలయాల్లో కనీస వసతులను కల్పించలేని పరిస్థితులలో ఉన్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి నిర్దేశించిన ఫీజులను వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో లేకుండా పోయింది. సరిపడా ఫీజులను వసూలు చేస్తూ, మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలం చెందుతున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అసలు విషయానికి వస్తే చాలా వరకు ప్రైవేటు పాఠశాలలో అర్హత లేని వ్యక్తులను తక్కువ జీతాలకు టీచర్లుగా నియమించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. ఫీజుల వసూళ్ల విషయంలో రాజీపడని ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలైన మంచినీటి వసతులు, శుభ్రమైన బాత్రూంలు, ఆట స్థలాల కొరకు మైదానాల కల్పనలో వెనకాడుతున్నాయి. తరగతులకు ఇంతని వెల కట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు అర్హులతో నాణ్యమైన విద్యను ఎందుకు అందించడం లేదని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న తరుణంలో పిల్లల మౌలిక వసతుల కల్పనలను విస్మరించి, కేవలం వసూళ్లకు మాత్రమే పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై జిల్లా విద్యాధికారి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పశుసంపదను గాలికుంటు వ్యాధి నుండి రక్షించుకోవాలి



## కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** రైతులు, పశు పోషకులు తమ పశు సంపదను గాలికుంటు వ్యాధి నుండి రక్షించుకోవాలని, పశువులకు సకాలంలో టీకాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా పశు సంవర్ధశాఖ సంయుక్త సంచాలకులు వై.రమేష్‌తో కలిసి జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సంబంధిత గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వలన తీవ్రమైన జ్వరం, పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, పునరుత్పత్తి, పని సామర్థ్యం తగ్గడం జరుగుతుందని, మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఎక్కువగా ఈ వ్యాధి వస్తుందని, 3 నెలలు పైబడిన అన్ని గోజాతి, గేదెజాతి పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. టీకాలు సురక్షితమైనవని, టీకాలు వేసిన ప్రతి పశువుకు గుర్తింపు చెవి పోగు వేసి వివరాలను భారత్ పశుదాన్ యాప్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలని, 4 నెలల వయస్సు దాటిన దూడలకు, పశువులకు చూడి పశువులకు 6 నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని, వ్యాధి సోకిన పశువులను వేరుచేసి పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ పూయాలని, వెంటనే సమీప పశు వైద్యులను సంప్రదించి చికిత్స అందించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకొని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు ఇప్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్, పశు సంవర్ధక శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధిః** ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎండదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఎండలో బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, ఉదయం 11 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎట్టి పరిస్థితులలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని అన్నారు. ఆశ, ఎ.ఎన్. ఎం.ల వద్ద, అంగన్ వాడీలలో ఓ.అర్.ఎస్. ద్రావణం అందుబాటులో ఉంచామని. పి.హెచ్.సి. ల యందు ఓ.ఆర్.ఎస్. ద్రావణం, ఐ. వి. ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచామని అన్నారు.చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతిరోజు సరిపడ త్రాగునీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు, టోపిని, సన్నని లేత రంగు కాటన్ వస్త్రాలను దరించాలని, ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటీతో పాటు ఓ.ఆర్.ఎస్. ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడుకోవచ్చన్నారు.వేడి ఎక్కువగా ఉండే సమయంలో వంట చేయడం మానుకోవాలనీ, వంట ప్రదేశాన్ని తగినంతగా గాలి, వెలుతురు ఆడడానికి తలుపులు, కిటికీలను తెరవాలని, ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటెడ్ శీతల పానీయాలు, పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను నివారించాలని, ఇవి వాస్తవానికి ఎక్కువ శరీర ద్రవాన్ని కోల్పోవడానికి లేదా కడుపు నొప్పికి దారి తీయవచ్చని అన్నారు . అదే విధంగా వీరికి సహాయం అందువరకు చల్లని ప్రదేశానికి తరలించాలని, వీలైనంత గాలి తగిలే విధంగా జాగ్రత్త వహించాలని డి.ఎం.అండ్ హెచ్. ఓ. ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తుక్కుగూడ సభకు తరలి వెళ్లిన మండల నాయకులు



**ప్రజాపక్షం/దండేపల్లి :** కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఎన్నికల మేనిఫెస్టో విడుదలలో భాగంగా తుక్కుగూడలో నిర్వహించే భారీ బహిరంగ సభకు మంచిర్యాల ఎంఎల్ఎ ప్రేంసాగర్ రావు నాయకత్వంలో దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం సభకు తరలి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఆర్‌జిపిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ సర్పంచులు ఏళ్తపు శ్రీనివాస్, పెంద్రం ప్రేమల శ్రీనివాస్, దాసరి ప్రేమ్ చంద్, ఎంపిటిసి సభ్యుడు ముత్తె రాజన్న, నాయకులు బోయిడి వెంగల్ రావు, కట్కూరి రాజన్న, చుంచు నగేష్, శరత్, బండ రాకేష్, కడతల లచ్చన్న, సతీష్, శ్రీనివాస్, కొత్త ధర్మయ్య తదితరులు ఉన్నారు

## చింతకుంటలో ఉచిత కంటి పరీక్ష శిబిరం



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శరత్ మాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆద్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని కొత్తపల్లి వైస్ ఎంపిపి భూక్య తిరుపతి నాయక్ ప్రారంభించారు. ఈ సంధర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం పేద ప్రజల సేవ చేయడం అభినందనీయమన్నారు. పేద బడుగు బలహీన వర్గాలు వైద్యం చేయించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఇలాంటి కంటి పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. తమ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది అజయ్ కుమార్, హర్షవర్ధన్, నవీన్ కుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగు దాడిలో రెండు ప్రాణాలు పోవడం దురదృష్టకరం




**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** ఏనుగు దాడిలో ఇద్దరు రైతుల ప్రాణాలు పోవడం దురదృష్టకరం అని డిఎఫ్ఒ నీరజ్ కుమార్ టిబ్రివాల్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర నుండి ఒక్క ఏనుగు గుంపు నుండి దారి తప్పి తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశించి బీభత్సం సృష్టించిందని, ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు తమ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని అన్నారు. ఏనుగు తిరిగి మహారాష్ట్ర కు వెళ్ళిపోయిందని ప్రజలు భయపడాల్సిన పని లేదని తెలిపారు. మరోసారి ఏనుగు వస్తే ఎదురుకునేందుకు తామంతా సిద్దంగా ఉన్నామని, ఏదైనా వన్యప్రాణి జనావాసాల్లోకి వచ్చిందని సమాచారం వస్తే అడవి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలను ఆదుకునేందకు తమ వంతు కృషి చేస్తామని, అటవీ సమీప ప్రాంతాల గ్రామాల ప్రజలు ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కారుణ్య నియామకాలతో 20 వేల మంది యువతకు ఉద్యోగాలు

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** జాతీయ కార్మిక సంఘాలు కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాలు పోగొడితే టిబిజికెఎస్ గడిచిన 10 సంవత్సరాల్లో కారుణ్యంతో 20 వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, సింగరేణిలో 43 వేల మంది కార్మికులున్నారంటే తమ యూనియన్ కృషితోనేనని టిబిజికెఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటి సభ్యుడు తొంగల రమేశ్ పేర్కొన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఆర్‌కె7 గనిపై టిబిజికెఎస్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కార్మికులు ఉత్సాహంగా ముందుకచ్చి యూనియన్ సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పారు. టిబిజికెఎస్ యూనియన్ కోలిండియాలో లేని అనేక హక్కులను సింగరేణి కార్మికులకు సాధించిపెట్టిందని, తమ హయంలో కార్మికుల సంక్షేమాభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. కార్మికుల సమస్యలను పరిష్కరించిన ఏకైకా యూనియన్ టిబిజికెఎస్ అని, కార్మికుల పక్షాన ఎల్లవేళలా పోరాడుతామని, టిబిజికెఎస్ కు పూర్వ వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈనెల 24న గోదావరిఖనిలో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దుర్గయ్య, రాజునాయక్, రాజేశం, గురుమూర్తి, రాజనర్సు, రత్నాకర్రెడ్డి, పోషం పాల్గొన్నారు.

## రైతులకిచ్చిన హామీలను నిలబెట్టుకోండి



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఉమ్మడి జిల్లా డిసిఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రైతు దీక్ష కార్యక్రమంలో భాగంగా ధర్మపురి పట్టణంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద శనివారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాకతుకు మించిన హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందని ఆరోపించారు. క్వింటాళుకు 500రూ.ల బోనస్, ఎకరాకు 25వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. కాంగ్రెస్‌పాలనలో ఒక్క రైతుకు నష్టపరిహారం అందించలేదని అన్నారు. వ్యవసాయం దండుగ అన్న కాంగ్రెస్ కు కేసిఆర్ పండుగ చేసి చూపించారని అందుకే కేసిఆర్ రైతు బాంధవుడు, రైతాంగానికి రైతు సారధిగా గుర్తింపు లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూర్‌లో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు కరీంనగర్ ప్రిన్సిపాల్ డా.జి.సమత ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియన్ ఫౌండేషన్, ఎన్‌జివో ఆద్వర్యంలో వారం రోజులుగా ప్లేస్‌మెంట్ డ్రైవ్, ట్రైనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమం చివరి రోజు శనివారం కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎసెంచర్, త్రెడ్జ్ ఐటి, యాక్సిస్ బ్యాంకు, రిలయన్స్ జియో, ఎకే కంపెనీ, పిన్ ఎక్సపర్ట్ కంపెనీలు పాల్గొన్నాయి. కంపెనీ హెచ్‌ఆర్‌లు నిర్వహించిన ఇంటర్వ్యూలలో దాదాపు 350 మంది విద్యార్థినులుగా పాల్గొనగా 140 విద్యార్థినులు ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.సమత, ప్లేస్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కె.గీతారాణి, వినయ్, ఎస్.సమణిత, ఎస్.విద్యాసాగర్, మొహమ్మద్ రాహుఫ్‌లు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు సిద్ధం




**ప్రజాపక్షం/ కోటపల్లి/ మంచిర్యాల :** కోటపల్లి మండలం కేంద్రంలోని తెలంగాణ మోడల్ హై స్కూల్‌లో ఆదివారం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరిండెంట్ తుమ్మల లక్ష్మారెడ్డి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ గుండేటి యోగేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు 6వ తరగతి, మధ్యాహ్నం 2 గంటలకు 7, 8 , 9, 10వ తరగతులకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

## ముందస్తు ఇంటి పన్ను చెల్లింపుపై రాయితీ



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం 2024 25 ఆర్థిక సంవత్సరంలో ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ముందస్తు ఇంటి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ కల్పించినట్లు శనివారం మంచిర్యాల మున్సిపాలిటీ కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 1 నుండి 31 మార్చి 2025 వరకు ఇంటి పన్ను మొత్తం ఈ నెల 30 లోపు ముందస్తుగా చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

## రూ.4 లక్షల నగదు పట్టుకున్న సిర్పూర్ ఎస్ఐ ధీకొండ రమేష్




**ప్రజాపక్షం/సిర్పూర్‌టి :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలం లోని రైస్ మిల్ వద్ద ఎస్ఐ ధీకొండ రమేష్ ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పెద్దబండకు చెందిన లోకండే లస్మయ్య అనే వ్యక్తి నుండి రూ. 4 లక్షల 07 వేలను స్వాధీనపర్చుకున్నట్లు ఎస్ఐ ధీకొండ రమేష్ తెలిపారు. పట్టుబడిన డబ్బులకు సంబంధించిన సరైన పత్రాలు లేని కారణంగా సీజ్ చేసి ఎఫ్ఎస్‌టి టీంకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

## బిజెపి 44వ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/సోన్ః** మండలంలోని న్యూ వెల్మల్ గ్రామంలో శనివారం భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల వైస్ ఎంపీపీ అంకల నాగయ్య,దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు రాయకొండ సాగర్‌లు పార్టీ జెండాను ఆవిష్కరించారు.బిజెపి సీనియర్ నాయకులు అంకం శ్రీనివాస్,జక్క ప్రశాంత్,బాలయి దేవన్న,సింధుల వారి దత్తు, అటోలి సురేందర్,జక్కచిన్న సాయన్న,కాసు ప్రవీణ్,అంకం గంగాధర్,నరేష్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఉద్భవించి నేడు ప్రపంచానికే మార్గదర్శనం చేసే స్థాయికి వెళ్లిందని, ప్రతి ఇంటికి ఫలాలు అందే విధంగా పనిచేస్తుందన్ని,రెండు స్థానాల నుండి 400 స్థానాలకు చేరుకుందని,రానున్న రోజుల్లో జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా,ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో మూడవ సారి అధికారంలోకి రావడం ఖాయమని,ఆదిలాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి నగేష్ ను గెలిపించి నరేంద్ర మోడీకి కానుకగా ఇస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

**ప్రజా పక్షం/ముత్తారం:** బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కిషన్ రెడ్డి... సాగునీరు అందక పత్తి, మిర్చితో పాటు వరి పంట పొలాలు నష్టపోయిన ప్రతి రైతును ఎకరాకు 25వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పెద్దపెల్లి జిల్లా మంథని లో తెలంగాణ రైతు బంధావుడు, మాజీ సీఎం కేసీఆర్, పెద్దపల్లి జెడ్పి చైర్మన్ టిఆర్ఎస్ పిలుపుమేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా మంథని లో నిర్వహించిన రైతు నిరసన దీక్ష కార్యక్రమానికి ముత్తారం మండల బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పోతుపెద్ది కిషన్ రెడ్డి హాజరై మాట్లాడారు. వరి ధాన్యానికి క్వింటాలకు బోనస్ గా 500 రూపాయలు ఇవ్వాలని, రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. రైతుబంధు పథకం ద్వారా రైతుకు 15వేల రూపాయలు చెల్లించాలని అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్ ఎంపీపీ రవీందర్ రావు, మహిళా మండల అధ్యక్షురాలు తప్పు స్వరూప చంద్రమౌళి, మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, ఎంపీటీసీ అల్లం తిరుపతి, మాజీ సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు నూనె కుమార్, మాజీ సర్పంచ్ గాదం స్రవంతి శ్రీనివాస్, తోపాటు అలువోజు రవీందర్, ఎద్దుల శ్రీనివాస్, కూరాకుల ఓదెలు తో పాటు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు రైతులు పాల్గొన్నారు.




## జన జాతరకు తరలిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ ముత్తారం :** ఏఐసీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న తుక్కగుడాలో జన జాతర సభకు ఐటి శాఖ మంత్రి, జాతీయ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం లోని ముత్తారం మండలంలోని ఓడేడు, అడవి శ్రీరాంపూర్, ముత్తారం, కేషనపల్లి,మచ్చు పెట తోపాటు తదితరు గ్రామాల నుండి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మాజీ జెడ్పిటిసి, సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తుక్కుగూడలో నిర్వహించేజాతరకు తరలివెళ్లారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**ప్రజాపక్షం/రామగిరిః** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని మంథని ఆర్డిఓ హనుమ నాయక్ అన్నారు. శనివారం కమాన్ పూర్మండలంలో ఐకెపి మరియు వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంథని ఆర్.డి.ఓ హనుమా నాయక్ శనివారం ప్రారంభించారు. మండలంలో సేర్ఫ్ ఆధ్వర్యంలో ముల్కలపల్లి, కమాన్ పూర్, పేరపల్లిలో , పి.ఎసి.ఎస్ ఆధ్వర్యంలో జూల పల్లి, గొల్లపల్లి, గుండారం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.డి.ఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. దళారులకు తక్కువ ధరలకు విక్రయించి నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరిపొద్దీన్ , ఆర్.ఐ సందాని, ఎపిఎం శైలజశాంతి , పి. ఏ.సి.ఎస్ సెక్రటరీ తిమ్మరాజు సంతోష్ కుమార్ లతో పాటు సీసీ శ్రీనివాస్ లతా చంద్రకళ అనూష మహేశ్వరి మరియు రేగుల కుమార్ బోనాల పవన్ దాసరి రాజు రైతులు, హమాలీలు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజా పక్షం/ముత్తారం :** ముత్తారం విద్యుత్ సబ్ స్టేషన్పరిధిలోని 11 కెవి ముత్తారం టౌన్ ఫీడర్( మెంటనెన్స్ ) మరమ్మతుల కారణంగా అదివారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ హనుమాన్ నాయక్ తెలిపారు. ముత్తారం సబ్ స్టేషన్ పరిధిలోని గల 11 కెవి టౌన్ లీడర్ విద్యుత్ తీగల కు అనుకొని ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని ట్రాన్స్ కో ఏఈ కోరారు.

## రాహుల్గాంధీని భావి భారత ప్రధాని చేయడమే లక్ష్యం

**ప్రజాపక్షం/ రామగిరి :** రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యమని కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు అన్నారు. శనివారం కమాన్ పూర్ మండల కేంద్రం నుండి రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహిస్తున్న జనజాతర సభకు వైనాల రాజు ఆధ్వర్యంలో భారీ ఎత్తున తల్లి వెళ్లారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ మేనిఫెస్టోను విడుదల చేయడం కోసం తుక్కుగూడలో పెద్ద ఎత్తున సమావేశం కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించడం జరుగుతుందని దీనికి అతి రథ మహారథులు రావడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశ పెట్టడం జరుగుతుందని అన్నారు. తరలి వెళ్లిన వారిలో జూలపల్లి ఎంపిటిసి సెవ్వ శంకరయ్య నాయకులు తాజా మాజీ సర్పంచ్ కటకం రవీందర్, భద్రపు శంకర్, సాగి శ్రీధర్ రావు ,గాండ్ల మోహన్, కుక్క రవి, బూడిద శ్రీనివాస్, చిందం సతీష్, కుచన వెంకటేష్ గొల్లపల్లి మొండి చొప్పది శేఖర్, జంగిలి కుమార్, బొంగుని సదయ్య కోలా నరస గౌడ్ ,భక్తుల అంజి గుమ్మడి వెంకన్న, కటకం కొమరయ్య, కటకం రాజయ్య తాళ్ల రాజయ్య, తదితరులు జూలపల్లి పెంచికలపేట రొంపిగుంట కమాన్ పూర్ గ్రామాల నుండి తరలి వెళ్లారు.



## 5శాతం రిబేట్తో ఆస్తిపన్ను చెల్లించండి.. మున్సిపల్ కషనర్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ః** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రిబే టుతో ఏప్రిల్ 30 లోపు చెల్లించిన వారికి వర్తించే విధంగా ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ తెలిపారు,



శనివారం ఆయన మాట్లాడుతూ 2024/25 సంవత్సరానికి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం బిల్లులో రిబేట్ వర్తిస్తుందని ఆయన తెలిపారు.ఈ అవకాశాన్ని ఏప్రిల్ 30 లోపు సుల్తానాబాద్ మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అబద్ధపు పునాదులపై అధికారం చేపట్టిన కాంగ్రెస్

**ప్రజాపక్షం/మంథని:** ఉచిత హమీలు, పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అబద్ధపు పునాదులపై అధికారం చేపట్టిందని జిల్లాపరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపులోబాగంగా శనివారం మంథని ప్రధాన చౌరస్తాలో ఈ యాసంగి సీజన్ నుంచే రూ.500బోనస్, ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలనే డిమాండ్తో నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 76ఏండ్ల స్వాతంత్ర్యంలో అగ్రబాగాన పరిపాలన చేసిన కాంగ్రెస్ ఆనాటి నుంచి ఈనాటి వరకు అబద్ధాలు, మోసాలతోనే అధికారంలోకి వచ్చి దేశాన్ని చీకట్లోకి నెట్టివేసిందన్నారు. పథకాల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ ఆశలోనే ప్రజలు రైతులు బతుకాలన్నదే కాంగ్రెస్ ఉద్దేశ్యమన్నారు.అన్ని ఇచ్చి ఆదుకున్న ప్రభుత్వాన్ని పక్కన పెట్టి మోసం చేసే కాంగ్రెస్కు అధికారం అప్పగించి గోసపడుతున్నామని అన్నారు. కాంగ్రెస్ మోసాలను, అబద్దాలను అర్థం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. రైతులకు న్యాయంజరిగే వరకు పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన దీక్ష కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన విప్

**ప్రజాపక్షం/ధర్మపురిః** వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను శనివారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పరామర్శించారు. పట్టణంలోని కాశెట్టి వాడకు చెందిన పాదం పెద్దన్న, ఆకుల చిన్న గంగన్నలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అదే విధంగా పట్టణానికి చెందిన దూడ వెంకట్ మృతి చెందగా, శనివారం పార్థీవ దేహానికి నివాళులు అర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.చ

## ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ముత్తారం:** వేసవికాలంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలు ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలని ఏపీడి అమృత్ కుమార్ అన్నారు.శనివారం పెద్దపల్లి జిల్లా హరిపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిడి అమృత్ కుమార్ మాట్లాడుతూ అన్ని గ్రామాలకు సంబంధించి ఉపాధి హామీ కూలీలు వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించి కూలీలకు ఈనో ప్యాకెట్లు అందించారు. అలాగే ఆయా గ్రామాల్లో ఏఎన్ఎం ల ద్వారా వేసవికాలంలో జాగ్రత్తలపై సమావేశాలు నిర్వహించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ బత్తుల అంజయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవళికతో పాటు తదితరులున్నారు.

## లక్కారంలో ఓటర్ అవగాహన సదస్సు

**ప్రజాపక్షం /ముత్తారం :** ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఓటు సద్వినియోగం చేసుకోవడం తమ బాధ్యతగా భావించాలని లక్కారం గ్రామ ప్రత్యేక అధికారి వరలక్ష్మి అన్నారు. అన్నారు. శనివారం ముత్తారం మండలంలోని లక్కారం గ్రామపంచాయతీ ఆవరణంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రత్యేక అధికారి వరలక్ష్మి పాల్గొని మాట్లాడారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియ పై అవగాహన పెంచుకోవాలని ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



## సుల్తానాబాద్లో బిజెపి ఎంపి అభ్యర్థి ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ః** సుల్తానాబాద్ మున్సిపాలిటీలో బిజెపి పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. ప్రచారంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్ గౌడ్, సుల్తానాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు కూకట్ల నాగరాజ్ స్థానిక బిజెపి నాయకులతో కలిసి ప్రచారం చేయడం జరిగింది. దేశానికి మళ్ళీ మోడీ ప్రధాని కావాలని, పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా నన్ను గెలిపించాలని గోమాసే శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి పార్టీ నాయకులు, మహిళా నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

## డాక్టర్ చిలుమోజు సందీప్ కుమార్కు వైద్య కీర్తి అవార్డు పురస్కారం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** శ్రీ దేవా కళాబృందం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సరం..2024 ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వైద్య సేవారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను సుల్తానాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ చిలుమోజు, సందీప్ కుమార్ కి ఉగాది పురస్కారాలతో పాటు వైద్య సేవా రత్న అవార్డు ను శనివారం అందజేశారు, వైద్యో నారాయణ హరి అన్నట్లుగా నిరంతరం వైద్యాన్ని అందిస్తూ సకాలంలో వైద్యం చేస్తూ ఆపద్బాంధవుడై అనుక్షణం కృషి చేస్తున్నందుకు గాను మునుముందు వైద్యరంగంలో జాతి గర్వించదగ్గ ఉత్తమోత్తమ వ్యక్తులుగా వెలుగొందాలని నిదర్శనంగా నిరంతరం సేవలందిస్తున్నందుకు గాను శ్రీ దేవా కళాబృందం సంస్థ చైర్మన్ చిర్ర రాజు ,కంపాటి అనిల్ చైర్మన్, విజయ్, దేవేందర్, ప్రశాంత్, రామస్వామి, డాక్టర్ సందీప్ కుమార్ కృతజ్ఞతలు తెలిపినారు.

# మాజీ ఎంఎల్ఏ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధిః ఎన్నికల్లో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతులకు మద్దతు ధర కంటే 500 రూపాయలు బోనస్ గా చెల్లించాలని పెద్దపెల్లి జిల్లా బి ఆర్ ఎస్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కోరుకొంటి చందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక గోదావరి ఖని చౌరస్తాలో టిఆర్ఎస్ కార్యాలయంలో రైతు నిరసన దీక్షల్లో పాల్గొని అనంతరమైన మాట్లాడుతూరైతు రుణమాఫీ చెప్పిన ప్రకారంగా రూ.2లక్షలను తక్షణమే మాఫీ చేయాలని, పంట నష్ట పోయిన రైతులకు ఎకరానికి 25000రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కంటి నిండా నిద్ర ఉండేలా కేసీఆర్ చేస్తే...పంట వేసుకునే పరిస్థితి లేక



ధర్నాలు, నిరసనలు చేసేటట్లు రేవంత్ రెడ్డి చేస్తున్నాడని,రాత్రి పూట మోటార్లు పెట్టేటట్లు చేసి నిద్ర కరవు చేస్తుండని, ఎన్నికలకు ముందు సరిగ్గా కేసీఆర్ చెప్పింది చెప్పినట్లే ఇప్పుడు జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ వస్తే ఆత్మహత్యలు, ఇన్వర్టర్లు, జనరేటర్లు, కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్ ఫార్మర్లు, ఎరువుల బాధలు, మద్దతు ధర లేక నష్టాలు, అప్పులు, మిత్తిలు తప్పవని కేసీఆర్ చెప్పింది ఇప్పుడు దృశ్యరూపంగా కనిపిస్తోందని,అహోరాత్రులు కష్టపడి సాగు నీటి ప్రాజెక్టులు కట్టి రైతులకు నీళ్లిచ్చిన కేసీఆర్ ఉన్న ప్రాజెక్ట్ లు నిర్వహించలేక ,పండిన పంటకేమో బోనస్ అంటూ బోగస్ వాగ్దానాలు ఎండిన పంటకు పరిహారమంటే పత్తా లేని పాలకులని ఎద్దేవా చేశారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు, కౌన్సిలర్ లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, రామగుండం నియోజకవర్గం అన్ని మండలాలనుండి పార్టీ ముఖ్య నాయకులు, రైతులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవు



ప్రజాపక్షం/జమ్మికుంటః జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మారుతినగర్లో గల సర్వేనెంబర్ 887లో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారన్న ఫిర్యాదుతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు అధికారులకు అక్రమంగా వేసిన షెడ్ను తొలగించారు. ఈ సంధర్భంగా మున్సిపల్ కమిషనర్ అయాజ్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకోవడం, నిర్మాణం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పట్టా భూములలో ఆన్లైన్లో టిఎస్ బిపాస్లో కావాల్సిన డాక్యుమెంట్స్ సమర్పించి ధరఖాస్తు చేసుకుని వారం రోజుల వ్యవధిలో అనుమతి పొందాలన్నారు. ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే వాటిని మున్సిపల్ ఆధ్వర్యంలో కూల్చి వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వరుణ్, టిపిఎస్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ప్రజాపక్షం/గంగాధరః గంగాధర మండలం మధురానగర్లో సాగునీరు లేక ఎండిపోయిన వరి పొలాలను బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన తూం నర్సయ్య అనే రైతు మూడు ఎకరాల వరి సాగు చేస్తే సాగునీరు లేకపోవడంతో దాదాపు రెండు ఎకరాల వరి పంట పొలం ఎండిపోయిందని, పంట చేతికి వచ్చే సమయంలో ప్రభుత్వం సాగు నీరు ఇవ్వక, ఉన్న బావిలో నీరు లేక పంట పొలం ఎండిపోయిందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగలేదని స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప ఈ ఎమ్మెల్యే రైతులకు చేసింది ఏమీ లేదన్నారు. ఇప్పటికైనా ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేసి ఎండిపోయిన పంట పొలాలకు ఎకరాకు 25 వేల చొప్పున పంట నష్టపరిహారం తక్షణమే చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోల అశోక్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తూం నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల రాజశేఖర్, బిజెపి సీనియర్ నాయకులు పెరిక శంకర్, పెరిక మహేష్, చంద, పర్శరాములు, బిజెపి నాయకులు, కార్యకర్తలున్నారు.

## బిజెపి హయాంలోనే దేశం పురోగతి

ప్రజాపక్షం/బైంసాః బిజెపి హయంలోనే దేశం పురోగతి సాధించిందని ఎమ్మెల్యే అన్నారు.శనివారం బైంసాలోని ఎస్.ఎస్.జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆయన మాట్లాడారు.44 సంవత్సరాల కాలంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి స్థాపించిన బిజెపి పార్టీ రెండు ఎంపీ స్థానాలతో మొదలై నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. ప్రధాని మోడీ హాయంలో ప్రపంచంలోనే ఐదువ స్థానం మన దేశం సాధించడం గర్వకారణమన్నారు.కరోనా కాలంలో వ్యాక్సిన్ వేయించి ఎందరో ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత బిజెపి దే అన్నారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు సాధించడమే తమ ధ్యేయమన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయనటిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్,పట్టణ అధ్యక్షులు మల్లేష్,జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్,బాలాజీ పటేల్,బాలాజీ సూత్రావే,గాలి రవి, తూమోల్ల దత్తాత్రి ,వేణుగోపాల్,కోర్వ శ్రీకాంత్, వెంకట్రావు పటేల్ ఉన్నారు.



**దేగాంలో..**

మండలంలోని దేగాం గ్రామంలో బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సిరంసుష్మ రెడ్డి బిజెపి జెండాను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి హయంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు.ఈకార్యక్రమంలో ఎంపిటిసి సుభాష్ పటేల్, నాయకులు చంద్రకాంత్ పటేల్,కిష్టయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా పర్యవేక్షణకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, త్రాగునీటి సరఫరాపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవికాలంలో జిల్లాలో త్రాగునీటి సరఫరా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని, పెద్దపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, త్రాగునీటి సరఫరా సమస్యలు ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలు సెల్ ఫోన్ నెంబర్ 9000963292 కు ఫోన్ చేసి సమస్య తెలియజేయాలని, సదరు సమస్యను వెంటనే క్షేత్రస్థాయిలో పరిష్కరించి నీటి సరఫరా పునరుద్ధరణ అయ్యేలా చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పోలింగ్ నిబంధనలపై అధికారులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి




ప్రజా పక్షం /రామగిరి : పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలపై పోలింగ్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం మంథని శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి వి. హనుమా నాయక్ అన్నారు. శనివారం రామగిరి లోని మంథని జే.ఎన్.టి.యు.హెచ్. యూనివర్సిటీ కళాశాల, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో గల 2వ బ్యాచి పోలింగ్ మరియు సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి వి. హనుమా నాయక్ మాట్లాడుతూ, మే13న జరిగే పోలింగ్ ను విజయవంతం చేసేందుకు పోలింగ్ అధికారులు ఎన్నికల కమీషన్ నిబంధనలు, మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో అనేక మార్లు పోలింగ్ విధులు నిర్వహించినప్పటికీ ప్రతి ఎన్నిక ప్రత్యేకంగా ఉంటుందని, కొత్త నిబంధనలు వస్తుంటాయని, అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా పోలింగ్ నిర్వహణ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోలింగ్ అధికారులు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్ పోలింగ్ ముగిసిన తర్వాత వివి ప్యాట్ లో స్లిప్పులను తొలగించాలని, సి.ఆర్.సి తప్పని సరిగ్గా చేయాలని, పోలింగ్ ముగిసిన తర్వాత కంట్రోల్ యూనిట్లో తప్పనిసరిగా క్లోజ్ బటన్ నొక్కాలని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు పోలింగ్ కేంద్రంలో నమోదవుతున్న పోలింగ్ శాతం వివరాలను సెక్టార్ అధికారులకు అందజేయాలని, పోలింగ్ ముగిసే సమయంలో సంబంధిత నిబంధనలను పాటిస్తూ అవసరమైన రిపోర్టులు అందజేయాలని పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ గుర్తింపు కార్డు పరిశీలించి, ఓటరు జాబితాలో ఉన్న అతని వివరాలు చూసుకుని, రిజిస్టర్ లో పేరు నమోదు చేయాలన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో తహశీల్దార్లు ఎం.డి. ఆరీఫోద్దీన్, ఎ. నాగరాజు, బి.రాంచందర్, మాస్టర్ ట్రైనర్లు, పోలింగ్ మరియు సహాయ పోలింగ్ అధికారులు, సంబంధిత అధికారులు, ఎలక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధ్వంసమవుతున్న రోడ్డు లారీలు అడ్డుకున్న గ్రామస్థులు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలం రాఘవ పూర్ రైల్వే స్టేషన్ కు గోదావరి ఖని మైనింగ్ నుండి బొగ్గు ను లారీ ల తరలిస్తుండటం తో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని వెంటనే రవాణా ను నిలిపి వేయాలని అందుగులాపల్లి గ్రామస్తులు లారీ లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చీకటి లక్ష్మి నారాయణ మాట్లాడుతూ నిత్యం ఇదే దారి గుండా రైతులు పంట పొలాలకు వెళ్తారని, పలుమార్లు ప్రమాదాలు జరిగి గాయాలు అయినట్లు తెలిపారు. కారే శ్రీనివాస్ మాట్లాడుతూ వెంటనే సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసారు. ఆందోళన లో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు దైవ మార్గాన్ని అనుసరించాలిః ఎమ్మెల్యే

ప్రజాపక్షం/ముధోల్ః ప్రతి ఒక్కరు దైవ మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.శనివారం మండలంలోని బోరేగాం గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతోనే మానవునికి మంచి విలువలని తెలిపారు.ముఖ్యంగా యువకులు భక్తి మార్గాన్ని అనుసరించడం మేలని సూచించారు.ఆంజనేయుడు శ్రీరామున్ని నమ్మి తన భక్తి కర్తవ్యాన్ని ప్రపంచానికి తెలిపాడన్నారు. విశ్వాసం,కర్తవ్యానికి ప్రతీక ఆంజనేయుడని పేర్కొన్నారు.నమ్మిన వారి పట్ల పూర్తి కర్తవ్య నిబద్ధతతో ఆంజనేయ స్వామి మార్గంలో నడవాలని కోరారు. విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా గ్రామస్తులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బాసర జడ్పీటీసీ వసంత రమేష్,నాయకులు తాటివార్ రమేష్,స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం



ప్రజాపక్షం/బైంసాః పట్టణంలోని పురాణ బజార్ గోశాల సమీపంలో శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశుగ్రాసం దగ్ధం అయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైతు మదుగుల సాయినాథ్ పశుగ్రాసం కొనుగోలు చేసి నిల్వ ఉంచాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అప్పటికే పూర్తిగా ఖాళీబూడిదైందని రైతు వాపోయాడు. సుమారు రూ. 5లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు.

## జనజాతరకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/ఇల్లందకుంటః హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో ఇల్లందకుంట మండల కేంద్రం నుంచి తుక్కుగూడలో జరిగే జనజాతర సభకు 18 గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గూడెపు సారంగపాణి, వంగ రామకృష్ణ, ఎంపిటిసి ఎక్కేటి సంజీవరెడ్డి మాట్లాడుతూ దేశంలో కేవలం మతతత్వంగా పదేళ్లు పరిపాలించిన బిజెపికి ఓట్లు అడిగే హక్కు లేదని, కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పి ఓట్లు అడిగే దమ్ముందన్నారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.

### కరీంనగర్లో



ప్రజాపక్షం/కరీంనగర్ః తుక్కుగూడలో జరిగిన జన జాతర బహిరంగ సభకు నగరం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నగర కాంగ్రెస్ కార్యాలయం నుంచి కార్లలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం వచ్చాక సినీ పరిశ్రమలో అవకాశాలు పెరిగాయి

**ప్రజాపక్షం/నస్పూర్:** తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సినీ పరిశ్రమలో యువతకు, కళాకారులకు అవకాశాలు పెరిగాయని సినీ నిర్మాత ముద్దం నరేశ్ వర్మ పేర్కొన్నారు. శనివారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ లో నారసింహా చిత్రాలయ సినీ నిర్మాణ సంస్థ నిర్మించిన బైరాన్పల్లి సినిమా ఒటిటిలో విడుదల సందర్భంగా ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గడిచిన 10 సంవత్సరాలల్లో సినీ పరిశ్రమలో ఎక్కువ శాతం మన రాష్ట్ర కళాకారులు పెరిగారని అన్నారు. తాము ఇప్పటి వరకు 4 చిత్రాలు నిరించామని, నూతనంగా తిర్యానీ సినిమా చిత్రీకరిస్తున్నామన్నారు. తమ సినిమాల్లో తెలంగాణ కళాకారులకు ప్రాధాన్యతతో పాటు మన ప్రాంతం కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ ఏరియాల కళాకారులకు, యువతకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. లఘు చిత్రాలను కూడా మన ప్రాంతం కళాకారులు అధ్భుతంగా తీస్తున్నారని, కానీ వారు కూడా వెండితెర సినిమాలుగా లఘు చిత్రాలను ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పూరెళ్ల గురుమూర్తి, దామెర రామ్మూర్తి, గజ్జెల్లి రాజలింగు, సందేశ్, రహీం పాల్గొన్నారు.




## పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం..

**ప్రజాపక్షం/కుంటాల:** మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో ఎంపీడీఓ రహీం శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పరిశుభ్రత, మొబిలైసేషన్, త్రాగునీరు ఉపాధి హామీ, శానిటేషన్ తదితర పనులపై సమీక్షించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జరుగుతున్న పచ్చదనం పరిశుభ్రత తడి చెత్త ,పోడి చెత్త వేరు చేసే సేకరణ,త్రాగునీరు సరఫరా తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశం

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశంను జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ శనివారం ఒక పకటన తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తాటియ గార్డెన్‌లో జిల్లాలోని రెండు నియోజకవర్గాల కాంగ్రెస్ బూత్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి, ఎస్‌టి చైర్మన్ కొప్పుల రాజు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పేర్కొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/బోథ్:** పెళ్లి కావడం లేదని మనస్థాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు బోథ్ ఎస్ఐ బి.రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోథ్ పట్టణంలోని న్యూ కాలనీకి చెందిన జాదవ్ జ్ఞానేశ్వర్(21) గత కొంత కాలంగా పెళ్లి సంబందాలు చూస్తున్నాడని తెలిపారు. అయితే ఉగాది పండుగ తరువాత పెళ్లి చేస్తామని కుటుంబ సభ్యులు చెప్పినా వినిపించుకోలేదని తెలిపారు.పెళ్లి కావడం లేదనే మనస్థాపంతో శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు.మృతుని తల్లి జాదవ్ సునిత బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బిఆర్ఎస్ నాయకుల అవినీతి ఒక్కొక్కటి బయటపడుతున్నాయి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** వడగండ్ల వానలకు రైతులు నష్టపోయింది వాస్తవమేనని వారిని ఆదుకునే భాద్యత మాకు ఉందని రైతులపైయ ఎన్నడూ లేనిది మొసలికన్నీరు ఎందుకు అని బ్లాక్ కాంగ్రెస అద్యక్షులు నర్సయ్య తెలిపారు.పంటనష్టాన్ని అంచనావేసి వారికి సహాయం అందిస్తామని రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఇది రైతు ప్రభుత్వమన్నారు.పొలంబాట పేరుతో కేసీఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు.నీతి నిజాయితి గల ప్రభుత్వం కాంగ్రెస్ రేవంత్ ప్రభుత్వానిది అని చెప్పారు. బీఆర్ఎస్ అవినీతి పీకల్లోతు కూరుకుపోయిందన్నారు. సమావేశంలో సద్దిలక్ష్మారెడ్డి, వంగగిరిధర్‌రెడ్డి, బండారిబాల్‌రెడ్డి, రఫీక్, రాంరెడ్డి, కిషన్, రాజ్‌కుమార్, ముత్యంరెడ్డి ఉన్నారు.



## కదిలిన కాంగ్రెస్ దండు..




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట నుండి తుక్కుగూడ కాంగ్రెస్ మహాసభకు భారీగా కార్యకర్తలు జనసమీకరణ చేసుకుని మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు సద్దిల క్ష్మారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు దొమ్మాట నర్సయ్య పలువాహనాలలో తరిలివెళ్ళారు.శాసనసభలో కాంగ్రెస్‌ను ఆదరించినట్లు పార్లమెంట్ ఎన్నికలలో మెజారిటీ సాధించాలని ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు.కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, రేవంత్ సైన్యం గూడవిజయ్‌రెడ్డి, సుడిదరాజెందర్, రాజునాయక్, మర్రిశ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, ఇమాం, లింగంగౌడ్, పందిర్ల శ్రీనివాస్ గౌడ్, బండారిబాల్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కోనరావుపేటలో



**ప్రజాపక్షం/కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని అన్ని గ్రామాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తుక్కుగూడలో జరుగుతున్న కాంగ్రెస్ జన జాతర సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ జన జాతర సభను విజయవంతం చేయడానికి మండలం నుండి కాంగ్రెస్ శ్రేణులు అందరూ పెద్ద ఎత్తున సభకు వెళ్లడం జరిగిందన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా విలేకరులు

**ప్రజాపక్షం/అసిఫాబాద్ :** ప్రభుత్వము, ప్రజలకు మధ్య విలేకరులు వారధిగా పనిచేస్తున్నారని ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవలక్ష్మి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యాలయంను జడ్పిటిసి సభ్యుడు అరిగేలా నాగేశ్వర రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వము ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్ళడానికి విలేకరులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏ మూలన జరిగిన విషయాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచేది విలేకరులని కొనియాడారు. విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలు సరస్వతి, సింగిల్విండో ఛైర్మెన్ అలిబీన్ అహ్మద్. ప్రసాద్ గౌడ్. నిసర్. టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.




## చలో తక్కుగూడ జనజాతర సభ




**ప్రజాపక్షం/వీణవంక:** హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితెల ప్రణవ్ ఆద్వర్యంలో వీణవంక మండల కేంద్రం నుంచి 26 గ్రామాలకు సంబంధించిన దాదాపు 100 మంది కార్యకర్తలు 2 బస్సులలో బయలుదేరి వెళ్లారు. లోక్‌సభ ఎన్నికలలో దేశమంతా అమలు పరిచే కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల సంధర్భంగా నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి సాహెబ్ హుస్సేన్, ఎక్కటిరఘుపాల్ రెడ్డి, పంజాల సతీష్, అంబాల రంగయ్య, పానుగంటి మధుకర్ రెడ్డి, నల్లకొండాల్ రెడ్డి, చదువు జైపాల్ రెడ్డి, దాసారపు లక్ష్మ ణ్, కామిడి శ్రీపతి రెడ్డి, కల్వల సదాశివ రెడ్డి, కంకణాల జగన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, కర్ర తిరుపతి రెడ్డి, మోహన్ రెడ్డి, పెద్ది సంపత్ రెడ్డి, గట్టయ్య, సతీష్, కర్ర కుమార్ రెడ్డి, బిక్షపతి, నిమ్మల సమ్మయ్య, రామ్ శరన్ రెడ్డి తదితరులున్నారు.

### చిగురుమామిడి నుండి




**ప్రజాపక్షం/చిగురుమామిడి:** హైదరాబాదులోని తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర భారీ బహిరంగ సభకు చిగురుమామిడి మండల కాంగ్రెస్ శ్రేణులు శనివారం తరలివెళ్లారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి జనజాతర యాత్ర జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత, మండల పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు, గ్రామ శాఖల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

### నిర్మల్ నుండి

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** నిర్మల్ జిల్లా నుండి జన జాతర కాంగ్రెస్ పార్టీ సభ తుక్కుగూడ సభ కోసం తరలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్మల్ మండల మాజీ అధ్యక్షులు సాద సుదర్శన్, సారంగాపూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ రాజేశ్వర్,కాంగ్రెస్ పార్టీ నిర్మల్ రూరల్ మండల అధ్యక్షుడు ఎంబరి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బట్టు అశోక్ ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించాలి...

**ప్రజాపక్షం/కుంటాల:** తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి, శ్రీనివాస్ పేర్కొన్నారు.శనివారం కుంటాల మండల కేంద్రంలో,అండకంటి గ్రామంలో నర్సరీ,క్రిమటోరియం,సిగ్రీగేషన్ షెడ్,వాటర్ సప్లై, శానిటేషన్ వర్క్స్ పలు అభివృద్ధి పనులపై పరిశీలించారు.వేసవి కాలంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకూడదని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీలలో పలు రికార్డులను పరిశీలించారు.ఆయన వెంట ఎంపీడీవో అబ్దుల్ రహీం,ఏపీవో గట్టు పల్లి నవీన్,పంచాయతీ కార్యదర్శులు రాజబాపు,సతీస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మహిళ అదృశ్యం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మహిళ అదృశ్యమైన సంఘటన కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపిన ప్రకారం రేకుర్తికి చెందిన బిజిలి మనీషా(25) ఈ నెల 3న భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చింది. గ్రామంలోని పిన్ని దగ్గర ఉండి ఉదయం అత్తగారింటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. తండ్రి దాసరి నరేస్ అత్తగారి ఇంటికి వెళ్లి చూడగా మనీసా కనబడడం లేదని తండ్రి నరేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

